# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, బుధవారం 12 జూన్ 2024 | KAMAREDDY




శెట్పల్లి సంగారెడ్డి పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## తరగతి గదులను తొలగించండి..

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

**కలెక్టర్ జితేశ్ పాటిల్**

నాగిరెడ్డిపేట(లింగంపేట), జూన్ 11: లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి ఉన్నత పాఠశాలను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మంగళవారం పరిశీలించారు. ఈ నెల 6న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'పేరుకే ఆదర్శం.. పనులు ఆలస్యం..' శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన ఆయన పాఠశాలను సందర్శించారు. కూలిపోయిన తరగతి గదిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న తొమ్మిది గదులను వెంటనే కూల్చివేయాలని ఎంఈవో రామస్వామి, ప్రధానోపాధ్యాయుడు శేషయ్యలకు సూచించారు. మట్టిని అక్కడి నుంచి వెంటనే తొలగించాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈ వెంకటేశ్వర్లును ఆదేశించారు. మిగిలిన ఐదు గదుల్లో మూడు గదులకు మరమ్మతులు చేయించాలన్నారు. మరో రెండు గదులకు రేకులు వేయించాలని అందుకు సంబంధించిన నిధులు వెంటనే మంజూరు చేస్తానని, వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

- **అసంపూర్తిగా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు**
- **యథేచ్ఛగా అనుమతిలేని ప్రైవేటు పాఠశాలల దందా**
- **పట్టించుకోని విద్యాశాఖ**

**కాసేపట్లో** బడి గంట మోగనున్నది. పిల్లలు మళ్లీ బడిబాట పట్టనున్నారు. ఆటలు కట్టిపెట్టి పుస్తకాలతో కుస్తీ పట్టే సమయం వచ్చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పాఠశాల తరగతి గది తలుపులు తెరుచుకోనున్నాయి. సెల్‌ఫోన్ గేమ్‌లు, మైదానాల్లో పరుగులు, వేసవి శిక్షణ శిబిరాల్లో బిజీగా గడిపిన పిల్లలను మళ్లీ స్కూళ్లకు పంపేందుకు తల్లిదండ్రులు రెడీ అయ్యారు. ఉత్సాహంగా, రెట్టించిన ఆసక్తితో పిల్లలను పాఠశాలలకు వెళ్లేలా మానసికంగా సిద్ధం చేశారు.



నిజామాబాద్‌లో కొనసాగుతున్న మరమ్మతు పనులు



కామారెడ్డి బాలుర పాఠశాల ప్రహరీ పరిస్థితి ఇది..



## బడికి వేళాయె..
# సమస్యల స్వాగతం



కామారెడ్డి బాలుర పాఠశాలలో ధ్వంసమైన మరుగుదొడ్ల తలుపులు







## నేటి నుంచి తెరుచుకోనున్న స్కూళ్లు

ఖలీల్‌వాడి/ కామారెడ్డి, జూన్ 11: ఇవ్వాల్టి నుంచి మళ్లీ బడి గంట వినిపించనున్నది. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు తెరచుకోనున్నాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. దీంతో ప్రైవేటు స్కూళ్లలో చదివే పిల్లల తల్లిదండ్రులు ఒకరోజు ముందుగానే విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్స్, షూస్, పుస్తకాలు తదితర సామగ్రిని కొనుగోలు చేశారు. మరో వైపు ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ చేరుకుంటున్నాయి. ఇదిలా ఉండగా ఒక వైపు పాఠశాలలు పునఃప్రారంభమవుతుంటే ఉపాధ్యాయులు బదిలీలు, ఉద్యోగోన్నతుల ఘట్టంలో బిజీగా ఉన్నారు. ఫైళ్లు పట్టుకొని మండల, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల వెంట తిరుగుతున్నారు.

**ప్రైవేటు గాలం.. పట్టించుకోని విద్యాశాఖ**

ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులకు గాలమేస్తున్నాయి. ఆకర్షణీయమైన ప్రకటనలు, కరపత్రాలు పంచుతూ అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. వేలల్లో డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. కొన్ని పాఠశాలలు అయితే అనుమతులు లేకపోయినా పిల్లలను చేర్పించుకుంటున్నాయి. ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్స్, టై, బెల్టు, షూస్ తదితర వాటిని యథేచ్ఛగా విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. జిల్లాలో విద్యా వ్యాపారం జోరుగా సాగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులు తల్లిదండ్రులతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు జీవో నంబరు 1 ప్రకారం గవర్నింగ్ బాడీ సమావేశాలు నిర్వహించి ఫీజులను నిర్ణయించాల్సి ఉంటుంది. సమావేశ తీర్మానాల ప్రకారం పాఠశాలలు నడుచుకోవాల్సి ఉంటుంది. కా నీ జిల్లాలో ఎక్కడా గవర్నింగ్ బాడీ సమావేశాలు నిర్వహిస్తున్న దాఖలాలు లేవు. ఈ విషయంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. దీంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అధికారులను తమ చెప్పుచేతుల్లో ఉంచుకొని అధిక ఫీజులు, డొనేషన్లు పేరిట వసూళ్ల పర్వానికి తెరలేపినట్లు సమాచారం. ఇదే విషయమై జిల్లా విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సమర్థించుకోవడం గమనార్హం. తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తల్లిదండ్రులు ఈ విషయంలో ఫిర్యాదు చేయడం లేదు. ఈ అంశాన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేటు యాజమాన్యాలు ఎంతో కొంత ముట్టజెప్పి తమ దందా కొనసాగిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 600 వరకు ప్రైవేటు పాఠశాలలుండగా అనేక పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నవే. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

### ఏర్పాట్లు చేశాం..



నెలన్నర నుంచి వేసవి సెలవు లు ప్రకటించడంతో పాఠశాలలు మూతబడ్డాయి. బుధ వా రం పునఃప్రారంభం కానుండడంతో పాఠశాలలను శుభ్రం చేయిస్తున్నాం. విద్యార్థులకు ఎలాం టి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

**-రాజు, డీఈవో, కామారెడ్డి**

### ఫిట్‌నెస్ తప్పనిసరి..



ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తప్పనిసరిగా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి. ఫిట్‌నెస్ ఉన్న వాటినే నడిపించాలి. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలకు 712 బస్సులు ఉండగా 450 బస్సులే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తిచేసుకున్నాయి. మిగతా వాహనాలు త్వరగా పరీక్షలు చేయించుకోవాలి. లేకపోతే బస్సులను సీజ్ చేస్తాం.

**- ఉమామహేశ్వర్ రావు,**
**జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, నిజామాబాద్**

## పూర్తికాని 'ఆదర్శ' పనులు

ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. నిధులు సైతం విడుదల చేసింది. కానీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమో.. అధికారుల పర్యవేక్షణ లోపమో కానీ అసంపూర్తి పనులతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. సాక్షాత్తు కలెక్టర్‌తోపాటు డీఈవో సైతం తనిఖీలు చేస్తూ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించినా నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని పాఠశాలలను చూస్తుంటే తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. చెత్తాచెదారంతోపాటు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఇంకా పూర్తికాలేదు. పలుచోట్ల ప్రహరీలు కూలిపోవడం, తలుపులు ధ్వంసమై కనిపిస్తున్నాయి. మరికొన్ని పాఠశాలలకు పైకప్పు కూడా వేయలేదు.



నిర్మాణ దశలో ఉన్న వంటశాల



పుస్తకాలను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు



నిజామాబాద్‌లోని ఓ పాఠశాలలో ధ్వంసమైన వేదిక

## ఆటోడ్రైవర్‌ను
# వెంటాడిన విధి

- **ఆటో నడవక గల్ఫ్ వెళ్లిన యువకుడు**
- **వారం రోజులకే గుండెపోటుతో మృతి**

రామారెడ్డి, జూన్ 11: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో బతుకు ఆగమైన ఓ ఆటోడ్రైవర్‌ను దురదృష్టం వెంటాడింది. ఇక్కడ ఆటో నడవడం లేదని, ఉపాధి కోసం ఎడారి దేశానికి వెళ్లిన వారానికే గుండెపోటు రూపంలో మృత్యువు కబళించింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఇనూస్ (42) వృత్తి రీత్యా ఆటోడ్రైవర్. ఆయనకు భార్య ఉమేరా, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అప్పు చేసి కొన్న ఆటోను నడుపుతూ వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని నెట్టుకురావడంతో పాటు చేసిన అప్పుకు వడ్డీ చెల్లించేవాడు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించడంతో ఉపాధి దూరమైంది. గిరాకీ లేక, వడ్డీ కట్టలేక అప్పు పెరిగిపోయింది. దీంతో ఆటోను అమ్మేసి మే 30న సౌదీ అరేబియా దేశంలోని జిద్దా పట్టణంలో హౌస్ డ్రైవర్‌గా వెళ్లాడు. విధుల్లో చేరిన తర్వాత ఈ నెల 4న కుటుంబసభ్యులకు ఫోన్ చేసి జ్వరంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపాడు. ఇదే విషయం అక్కడి కపిల్ (యజమాని)కి తెలపగా అతను స్పందించలేదు. దీంతో ఇనూస్ ఒక్కడే దవాఖానకు వెళ్తూ మార్గమధ్యలో గుండెపోటుతో కుప్పకూలాడు. అక్కడి పోలీసులు వేలిముద్రల ఆధారంగా మృతుడిని ఇనూస్‌గా గుర్తించి కపిల్‌తో పాటు ఇక్కడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. చేసిన అప్పులు అలాగే ఉండగా.. మళ్లీ అప్పు చేసి గల్ఫ్‌కు వెళ్లిన ఇనూస్ మృతితో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి రప్పించాలని కుటుంబసభ్యులు, బంధువులు వేడుకుంటున్నారు.



మృతదేహం కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు



ఇనూస్ (ఫైల్)

## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

**ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ**

కామారెడ్డి, జూన్ 11: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ జితేశ్ పాటిల్‌తో కలిసి మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, జిల్లా పంచాయతీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి మున్సిపాలిటీల్లో 18,800 ఇండ్లకు రోజుకు 18.23 మిలియన్ లీటర్ల నీరు అవసరం కాగా మిషన్ భగీరథ, పెద్ద చెరువు, బోర్‌వెల్స్ ద్వారా 10.59 మిలియన్ లీటర్ల నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇందల్వాయి నుంచి మల్లన్నగుట్ట వరకు 24.7 కిలోమీటర్ల మేర రూ.195 కోట్లతో నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నామని, టెండర్లు కూడా పూర్తయినట్లు తెలిపారు. అమృత్ 2.0 కింద కామారెడ్డి మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు రూ.93 కోట్లతో రూపొందించిన కార్యక్రమం అగ్రిమెంట్ కావాల్సి ఉన్నదని, త్వరలో అగ్రిమెంట్ చేసుకొని పనులు ప్రారంభిస్తామన్నారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనుల ప్రగతిని సమీక్షిస్తూ పెండింగ్ బిల్లులకు సంబంధించి రూ.375 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ ఈఈ విద్యావతికి సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్‌ఈ రాజేంద్ర కుమార్, మున్సిపల్ కమిషనర్ సుజాత, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కలెక్టర్ జితేశ్ పాటిల్

**ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు**

## ఉన్నత పదవుల్లో ఉన్న చాలామంది ప్రభుత్వ బడుల్లో చదువుకున్నవారే

ఎల్లారెడ్డి రూరల్/నాగిరెడ్డిపేట, జూన్ 11: ఉన్నత పదవుల్లో ఉన్న చాలా మంది ప్రభుత్వ బడుల్లో చదువుకున్నవారేనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లపేట ప్రభుత్వ పాఠశాల, నాగిరెడ్డిపేట కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులకు ఆయన మంగళవారం యూనిఫామ్స్, పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తానుకూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని చెప్పారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎంపీపీ కర్రె మాధవి, ఎంఈవో వెంకటేశం, ఐకేపీ ఏపీఎం ప్రసన్నారాణి, మున్సిపల్ మేనేజర్ వాసంతి, నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



వెల్లుట్లపేటలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావ్